నమస్తే తెలంగాణ
నిజామాబాద్
3 | నిజామాబాద్, బుధవారం 24 జూలై 2024 | NIZAMABAD

# రైతన్న రంది



- రుణమాఫీపై తొలగని సందిగ్ధం
- బ్యాంకుల వద్దకు అన్నదాతల పరుగులు
- సరైన వివరాలు తెలియక ఆందోళన చెందుతున్న కర్షకులు

**రైతులకు రుణమాఫీ రంది పట్టుకున్నది.** క్రాప్‌లోన్ మాఫీ అయ్యిందా..? కాలేదా..? అనే స్పష్టత లేకపోవడంతో ఏం చేయాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. రుణమాఫీ కాని రైతులు పట్టాపాస్ పుస్తకాల జిరాక్సులు, ఆధార్‌కార్డులను పట్టుకొని బ్యాంకులకు పరుగులు తీస్తున్నారు. గత శుక్రవారం నుంచి రైతులందరూ బ్యాంకుల వద్ద బారులు తీరుతున్నారు. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు బ్యాంకుల వద్ద పడిగాపులు కాస్తూ రుణమాఫీ వివరాలు తెలియకపోవడంతో నిరాశతో ఇంటిబాట పడుతున్నారు. ఏం చేయాలో తెలియక సందిగ్ధంలో అన్నదాతలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.
–కోటగిరి, జూలై 23





ఎత్తొండలో రైతులతో కిక్కిరిసిన బ్యాంకు

## సరైన సమాధానం చెప్పట్లేదు..



నా పేరు శివరాజ్. నాకు కొడిచెర్ల శివారులో వ్యవసాయ భూమి ఉన్నది. నేను కల్లూర్‌లోని బ్యాంకులో రూ.62 వేలు క్రాప్‌లోన్ తీసుకున్న. రుణమాఫీ జాబితాలో నాపేరు లేకపోవడంతో ఆందోళనగా ఉన్నది. మాఫీ గురించి బ్యాంకుకు వెళ్లి అధికారులను అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదు. ఎవరిని అడగాలో అర్థం కావడం లేదు.

## కొద్దిరోజుల తర్వాత రమ్మంటున్నారు..

నా పేరు భూంగోండ. నాకు కోటగిరి శివారులో 2.8 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. కోటగిరి ఎస్‌బీఐలో రూ.90వేల క్రాప్‌లోన్ తీసుకున్న. ఏటా వడ్డీ కడుతున్న.. అయితే రుణమాఫీ జాబితాలో నా పేరు రాలేదు. బ్యాంకు అధికారులను అడిగితే బ్యాంకు ఖాతాలో రుణమాఫీ డబ్బులు ఇంకా జమ కాలేదని చెప్పారు. పరిస్థితి ఏమిటనేది అర్థం కావడం లేదు. బ్యాంకు అధికారులకు మరోసారి వెళ్లి అడిగితే కొద్ది రోజుల తర్వాత రమ్మని సమాధానం చెప్పి పంపించారు.



## రూ. 50వేలు రుణమాఫీ కాలేదు..

నా పేరు కప్ప సాయన్న.. నాకు రాంపూర్ శివారులో ఎకరం వ్యవసాయ భూమి ఉన్నది. కోటగిరి ఎస్‌బీఐలో నాకు క్రాప్‌లోన్ రూ.50వేలు ఉండే.. ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని చెప్పడంతో చాలా సంతోషం అనిపించింది. ప్రభుత్వం రూ.లక్షలోపు రుణమాఫీ ప్రకటించింది కానీ నాకు రుణమాఫీ రాలేదు. బ్యాంకులో అధికారులను అడిగితే మాఫీ రాలేదని సమాధానం చెప్పారు. మరి మాఫీ అయ్యిందా.? లేదా? ఎందుకు కాలేదో అర్థం కావడం లేదు. జాబితాలో నా పేరులేదు..మాఫీ అయ్యేటట్లు నాకు న్యాయం చేయండి సారూ.






- రైతులకు తెలియకుండానే లోన్లు లేపిన వైనం
- రుణమాఫీతో బట్టబయలైన అక్రమ వ్యవహారం
- లోన్‌మాఫీ అయినట్లు రైతుల ఫోన్లకు మెసేజ్
- 400 మంది రైతులు.. రూ.1.50 కోట్ల రుణాలు
- రుణమే తీసుకోలే.. మాఫీ ఎలా అయ్యిందంటున్న రైతులు

# ఒప్పందాల పేరిట దారుణం

ప్రైవేట్ షుగర్ ఫ్యాక్టరీ నిర్వాకం?



నిజామాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ రామారెడ్డి: పంట రుణాల మాఫీ ఏమో కానీ భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. అసలు రుణాలే తీసుకోని రైతులకు మాఫీ అయినట్లు ఫోన్లకు మెసేజ్‌లు రావడంతో అతిపెద్ద స్కామ్ బయటపడింది. అన్నదాతలకు తెలియకుండానే అక్రమంగా లోన్లు లేపుకున్న వ్యవహారం ఉమ్మడి జిల్లాలో కలకలం రేపుతున్నది. బైబ్యాక్ ఒప్పందం పేరిట రైతుల సంతకాలు తీసుకుని వారి సమ్మతి లేకుండగానే రుణాలు తీసుకున్నట్లు వెల్లడైంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూ.లక్ష లోపు రుణాలు మాఫీ చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మాఫీ వర్తించిన రైతుల ఫోన్లకు సీఎం పేరిట మెసేజ్‌లు వస్తున్నాయి. రామారెడ్డి, సదాశివనగర్, మాచారెడ్డి, గాంధారి మండలాల్లోని రైతులకు వచ్చిన మెసేజ్‌లతో అక్రమ లోన్ల వ్యవహారం బయటపడింది. అసలు రుణమే తీసుకోని తమకు మాఫీ వర్తించడమేమిటని అన్నదాతలు తలలు పట్టుకున్నారు. చివరకు ఫ్యాక్టరీ నిర్వాహకులే తమ పేరిట లోన్లు లేపుకున్నట్లు తెలిసి అవాక్కయ్యారు. స్థానికంగా ఉన్న గాయత్రి షుగర్ ఫ్యాక్టరీతో రైతులకు చెరుకు పంట సాగు విషయంలో బైబ్యాక్ ఒప్పందాలు ఉన్నాయి. తమ పట్టాపాస్ పుస్తకాలు, ఇతర వివరాలు యాజమాన్యం వద్ద ఉన్నాయని, వాటితోనే నిర్వాహకులు తమ పేరిట రుణం తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఆగమాగమవుతున్న రైతులు

చెరుకు సాగు చేసేందుకు రైతులు ప్రైవేట్ షుగర్ ఫ్యాక్టరీతో ఒప్పందం చేసుకున్నారు. చెరుకు మొక్కలను, ఎరువులను, ఇతరత్రా సాంకేతిక సహకారాన్ని ఫ్యాక్టరీ అందిస్తుంది. పంట చేతికొచ్చిన తర్వాత యాజమాన్యమే సేకరిస్తుంది. బైబ్యాక్ ఒప్పందం ఇంత వరకు పరిమితం కాగా, రైతుల పేరిట రుణాలను తీసుకునే అవకాశం లేదు. అయితే, రైతులకు తెలియకుండా రుణాలు తీసుకోవడం ఇప్పుడు అనుమానాలకు తావిస్తున్నది. నాలుగు మండలాల్లోని 2,500 మంది పేరిట లోన్లు తీసుకున్నట్లు సమాచారం. ప్రభుత్వం మొదటి విడుతలో రూ.లక్షలోపు రుణాలను మంజూరు చేయగా, ఆయా మండలాల్లోని రైతులకు రుణమాఫీ అయినట్లు మెసేజ్‌లు వచ్చాయి. కనిష్ఠంగా రూ.26 వేలు నుంచి మొదలు రూ.90 వేలు వరకు రుణాలు మాఫీ అయినట్లు నిజామాబాద్ నాందేవ్‌వాడలో గల యూనియన్ బ్యాంక్ నుంచి మెసేజ్‌లు వచ్చాయి. 400 మందికి సంబంధించి రూ.కోటిన్నర వరకు తొలి విడుతలో మాఫీ అయ్యిందని రూ.లక్షన్నర, రూ.2 లక్ష లోపు రుణాలు రద్దు అయితే అప్పుడు బాధితుల సంఖ్యతో పాటు రుణాల మొత్తం మరింత పెరిగే అవకాశమున్నది. మరోవైపు, రుణాల మంజూరులో ఫ్యాక్టరీ ఉద్యోగుల పాత్రతో పాటు బ్యాంకర్ల సహకారం ఉండే ఉంటుందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బ్యాంకు అధికారులు, వ్యవసాయాధికారులతో కుమ్మక్కై అక్రమంగా రుణాలు తీసుకున్నట్లు సమాచారం. రైతుల సమ్మతి లేకుండానే బ్యాంకర్లు లోన్ ఎలా మంజూరు చేశారని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు, మంజూరైన రుణాలకు షుగర్ ఫ్యాక్టరీ బాధ్యులకు ఎలా ఆథరైజేషన్ కల్పిస్తారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇందులో నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా రుణ మోసం జరిగిందనడానికి బలమైన కారణాలు వెలుగు చూస్తున్నాయి. మరోవైపు, రైతుల ఆందోళనతో షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం కాళ్ల బేరానికి వచ్చినట్లు తెలిసింది. చెక్కుల రూపంలో తిరిగి చెల్లింపులు జరుపుతామంటూ బేరసారాలు సాగిస్తున్నట్లు సమాచారం.

### మాఫీ డబ్బులు రైతులకే ఇవ్వాలి..

గాయత్రి ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు తెలియకుండా రుణాలు తీసుకోవడం దారుణం. లోన్ డబ్బులతో పాటు మాఫీ సొమ్మును కూడా రైతులకే ఇవ్వాలి. లేకపోతే బాధితులతో కలిసి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం.
**- రాజేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ, సదాశివనగర్**


### అగ్రిమెంట్ పేరిట లోన్లు లేపారు..

ఒప్పంద పత్రాలని చెప్పి రైతుల సంతకాలు తీసుకుని వారి పేరిట లోన్లు తీసుకోవడం ఎంతవరకు సమంజసం. ప్రభుత్వం రుణమాఫీ చేయడంతోనే అక్రమ రుణాల విషయం బయటకొచ్చింది. ఫ్యాక్టరీ అధికారులను అడిగితే సంస్థ తరఫున రైతుల పేర్లపై రుణం తీసుకున్నామని చెప్పిండ్రు. ఫ్యాక్టరీ వారే 2,500 మంది పేరిట లోన్లు లేపుకున్నారు. ఆ సొమ్మును రైతులకే ఇవ్వాలి.
**- నారెడ్డి దశరథ్‌రెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్**

# కూరలో బొద్దింక..

## టీయూ బాయ్స్ హాస్టల్‌లో ఘటన

డిచ్‌పల్లి, జూలై 23: తెలంగాణ యూనివర్సిటీ నూతన బాయ్స్ హాస్టల్‌లో గుడ్డు కూరలో బొద్దింక కనిపించింది. గత శుక్రవారం మధ్యాహ్నం వండిన గుడ్డు కూరలో ఓ విద్యార్థికి పురుగు వచ్చిందని విద్యార్థులు తెలిపారు. అయితే మంగళవారం ఘటన వెలుగులోకి రావడంతో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మహిళల హాస్టల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థికి పురుగు వచ్చి వారం రోజులు కూడా కాలేదు, నూతన బాయ్స్ హాస్టల్‌లో అదే ఘటన జరగడం దురదృష్టకరమని విద్యార్థులు మండిపడుతున్నారు. భోజనంలో పురుగులు వస్తున్నా వార్డెన్ పట్టించుకోవడం లేదని, హాస్టల్ సమస్యలపై రిజిస్ట్రార్ మాట్లాడడం లేదని పలువురు ఆరోపించారు. మళ్లీ ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పురుగు వచ్చిన విషయంపై రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరిని వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదన్నారు. ఏవేవో సంబంధం లేని ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయని సమాధానమిచ్చారు.





## వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం

కంఠేశ్వర్, జూలై 23: జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాలతో జిల్లాలో ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే 08462-220183 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. కంట్రోల్ రూం నిరంతరం పనిచేస్తుందని, ఏ సమయంలోనైనా ప్రజలు ఫోన్ ద్వారా సమాచారం తెలుపవచ్చని అన్నారు. సమాచారం అందిన వెంటనే సహాయక చర్యలు చేపట్టేందుకు వీలుగా ఆయా శాఖల అధికారులను సిద్ధంగా ఉంచామని కలెక్టర్ తెలిపారు.

# మళ్లీ నిరాశే..

కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు ప్రయోజనం శూన్యం






- యథాలాపంగానే కొనసాగిన వివక్ష
- పసుపు బోర్డు ఏర్పాటు ప్రస్తావనే కరువు
- రైల్వే అభివృద్ధిపైనా అస్పష్టమైన ప్రకటన
- వేతన జీవులకు కొత్త పన్ను విధానం అమలు

నిజామాబాద్, జూలై 23(నమస్తే తెలంగాణ ప్రతినిధి): అనుకున్నట్లే అయ్యింది. పసుపు బోర్డు ఏర్పాటు విషయంపై కేంద్ర ప్రభుత్వం దాటవేసింది. పూర్తిస్థాయి కేంద్ర బడ్జెట్ 2024-25లో ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన హామీపై ఎలాంటి స్పష్టత రాలేదు. ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశించిన ప్రయోజనాలకూ మోక్షం దక్కలేదు. ఉత్తర తెలంగాణలోని నాలుగైదు జిల్లాల్లోని రైతులు ఆశించిన మేరకు పసుపు బోర్డుపై కేంద్రం ఎలాంటి మాటెత్తకపోవడంపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల ముందుకు పీఎం మోదీ చెప్పిన విధంగా పసుపు బోర్డు విషయంలో కేంద్రబడ్జెట్‌లో ప్రస్తావన ఉంటుందని అంతా ఊహించారు. అందుకు భిన్నంగానే గతం మాదిరిగానే వివక్షను కేంద్ర విత్త మంత్రి నిర్మలా సీతారామన్ ప్రదర్శించారు. ఇతర రాష్ట్రాలకు తాయిలాలు ఘనంగా ప్రకటించగా, తెలంగాణ రాష్ట్రానికి మొండి చేయి చూపారు. అందులో ఉమ్మడి జిల్లాకు అంతులేని నిరాశే మిగిలింది. ఈ ప్రాంతం నుంచి రెండు దఫాలుగా బీజేపీ ఎంపీగా ధర్మపురి అర్వింద్ కొనసాగుతున్నప్పటికీ ఈ ప్రాంత ప్రజల ఆశయాలు, ఆకాంక్షలను నెరవేర్చకపోవడం కనిపిస్తున్నది. ఎంపీగా ధర్మపురి అర్వింద్ వైఫల్యతను ఈ బడ్జెట్ తీరుతో తేటతెల్లమైంది. రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ పక్కకు పెడితే డబ్లింగ్, కొత్త రైల్వేలైన్ ప్రతిపాదన, కొత్త రైళ్లను అందుబాటులోకి తీసుకువచ్చే ప్రతిపాదనలేవీ కేంద్రం పట్టించుకున్నట్లుగా కనిపించడం లేదు.

### రైతులకు మొండిచేయి..

అసెంబ్లీ ఎన్నికలకు నెలన్నర రోజుల ముందు స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిజామాబాద్‌లో చేసిన ప్రకటనకు విలువ లేకుండా పోయింది. పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామంటూ చెప్పినప్పటికీ అనంతర కాలంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో, పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్ 2024-25లో ఇందుకు సంబంధించిన ప్రకటనే లేకపోవడం రైతులను కలవరపెడుతున్నది. ఎంపీ అర్వింద్ నామమాత్ర పాత్రకే పరిమితం కావడం తప్ప.. నోరు విప్పి రైతుల డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం వద్ద ప్రస్తావించిన దాఖలాలే లేకపోవడం శోచనీయమంటున్నారు

### అంతా ఉత్తిదే..

డబుల్ సీట్లను కొల్లగొట్టి రాజకీయంగా బలం పుంజుకున్నప్పటికీ తెలంగాణ ప్రాంతంపై బీజేపీ అధినాయకత్వానికి పట్టరాని నిర్లక్ష్యం బడ్జెట్‌లో కేటాయింపులతో తేటతెల్లం చేస్తున్నది. గతంలో కేంద్రం చూపే వివక్షపై రాష్ట్రంలోని కేసీఆర్ సర్కారు అడుగడుగునా ఎండగట్టేది.

### రైల్వే అభివృద్ధిపైనా శీతకన్ను...

రైల్వే విస్తరణ పనులు, అభివృద్ధిపై కేంద్ర సర్కారు శీతకన్ను కొనసాగింది. నిజామాబాద్ నుంచి డబ్లింగ్ రైల్వే ట్రాక్, ఆర్మూర్ - ఆదిలాబాద్, బీదర్ - బోధన్ రైల్వే లైన్ ప్రతిపాదనలు పట్టాలెక్కకపోగా పట్టించుకున్న నాథుడే లేకుండా పోయాడు.

### విద్యారంగానికి నిరాశ..



ఎల్లారెడ్డి రూరల్, జూలై 23: విద్యారంగానికి బడ్జెట్‌లో కనీసం 10శాతం నిధులు కేటాయించాలని విద్యా కమిషన్లు సూచించినప్పటికీ, 2.66 శాతం కేటాయించడం చూస్తే కేంద్ర ప్రభుత్వం విద్యారంగానికి ఇస్తున్న ప్రాధాన్యత అర్థమవుతుంది. తగిన కేటాయింపులు లేకుండా అందరికీ నాణ్యమైన విద్య అందించడం అసాధ్యం.
**-అనిల్‌కుమార్, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి**

### ఆత్మగౌరవం దెబ్బతీసేలా ఉంది



తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం దెబ్బతీసేలా కేంద్ర బడ్జెట్ ఉన్నది. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి ఎలాంటి నిధు లు కేటాయించలేదు. పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందితేనే నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించే అవకాశం ఉండేది. బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు రాష్ట్రానికి మేలు జరిగేలా చూడాలి.
**-వెంకన్నగుప్తా, పారిశ్రామికవేత్త, బాన్సువాడ**

### తెలంగాణపై సవతి ప్రేమ..



ఖలీల్‌వాడి, జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఏమాత్రం నిధులు కేటాయించకపోవడం బీజేపీ ప్రభుత్వానికి తెలంగాణపై ఉన్న సవతి ప్రేమను తెలియజేస్తున్నది. బోధన్-బీదర్ రైల్వేలైన్, నిజాంషుగర్ ఫ్యాక్టరీ, జక్రాన్‌పల్లి విమానాశ్రయానికి నిధులు కేటాయించకపోవడం నిరాశకు గురిచేసింది. బీజేపీ ఎంపీలు నోరు మెదపకపోవడం సరికాదు.
**- రమేశ్‌బాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి**

### నలుగురు.. ఎనిమిది అయినా లాభంలేదు



కంఠేశ్వర్, జూలై 23: బడ్జెట్‌లో తెలంగాణకు మోదీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసింది. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర సహాయక మంత్రులుగా ఉన్నప్పటికీ నిధులు తేవడంలో విఫలమయ్యారు. ధర్మపురి అర్వింద్ ఐదేండ్లు ఎంపీగా ఉండి ఇప్పుడు మళ్లీ ఎంపీ అయినా కూడా ప్రవర్తనలో, ఆలోచనలో మార్పు రాలేదు. తెలంగాణ నుంచి బీజేపీకి నలుగురు ఉన్న ఎంపీలు రెట్టింపై ఎనిమిది మందికి చేరినా రాష్ట్రానికి నిధులు రాకుండా మోసం చేశారు.
**- షబ్బీర్ అలీ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు**

### తెలంగాణకు మొండి చేయి..



కామారెడ్డి, జూలై 23: బీజేపీ ప్రభుత్వం పడిపోకుండా ఉండేందుకు తెలంగాణకు అన్యాయం చేసి ఆంధ్రాకు మాత్రమే న్యాయం చేశారు. తెలంగాణకు మొండి చేయి చూపారు. రాష్ట్రంలో ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నప్పటికీ ఎలాంటి నిధులు తేలేదు. ఈ మంత్రులు ఉంటే ఎంత పోతే ఎంత. తెలంగాణకు బీజేపీ అన్యాయం చేసింది. అభివృద్ధి చెందుతున్న తెలంగాణకు ఏమీ ఇవ్వకుండా, ఆంధ్రాకు రూ.15వేల కోట్లు ఇచ్చారు.
**- ముజీబుద్దీన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, కామారెడ్డి**

### కార్పొరేట్లకే పెద్దపీట..



డిచ్‌పల్లి, జూలై 23: బడ్జెట్‌తో సామాన్యులకు, వేతన జీవులకు, మధ్యతరగతి వారికి ప్రయోజనం లేదు. కార్పొరేట్లకే ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. అనేక ఆశలు, భారీ అంచనాల మధ్య వికసిత్ భారత్ లక్ష్యంగా రూ. 48.21లక్షల కోట్లుగా ప్రవేశపెట్టి ఈ బడ్జెట్‌లో మొత్తం ఆదాయం కేవలం రూ.32.07 లక్షల కోట్లు మాత్రమే. ఇందులో పన్ను ఆదాయం రూ. 28.83లక్షల కోట్లు కాగా, అప్పులు, పన్నేతర ఆదాయాలు రూ.16లక్షల కోట్లుగా అంచనా వేశారు. ఈ బడ్జెట్‌లో 34శాతం అప్పులతో వికసిత భారత్ కల నెరవేరుతుందా?
**-డాక్టర్ ఎ.పున్నయ్య, అర్థశాస్త్ర విభాగాధిపతి, టీయూ**